సాక్షి ఏలూరు

ఆదివారం | 21 | జూలై | 2024



రెగ్యులైజేషన్ ఎప్పుడో?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినా కాంట్రాక్ట్ లెక్చరర్ల ఒప్పంద గడువు పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. 8లో ▸



ఆస్తి కోసం తండ్రి హత్య

ఆస్తి తన పేరున రాయలేదనే కక్షతో మద్యం మత్తులో కన్నతండ్రిపై దాడి చేసి హతమార్చాడు కొడుకు. కామవరపుకోట మండలం తడికలపూడిలో ఈ ఘటన జరిగింది. 8లో ▸



శ్రీవారి క్షేత్రంపై వర్షం ప్రభావం

వర్షం కారణంగా చినవెంకన్న దివ్య క్షేత్రంలో భక్తుల రద్దీ బాగా తగ్గింది. శనివారం వర్షం కారణంగా ఆలయానికి భక్తులు నామమాత్రంగా విచ్చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్‌గా ధాత్రి రెడ్డి



ఏలూరు(మెట్రో): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పాడేరు సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.ధాత్రిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం జేసీగా ఉన్న బి.లావణ్య వేణిని సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పూర్వపు ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు ఐఏఎస్‌ల బదిలీల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చింది.

ఐటీడీఏ పీఓగా హరిత



బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా డి.హరిత నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూఎఫ్ఐడీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న హరితను ఐటీడీఏ పీఓగా నియమించారు. ప్రస్తుత పీఓ ఎం.సూర్యతేజ నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

రత్నాచల్, కాకినాడ-తిరుపతి రైళ్లు పునరుద్ధరించాలి



రైల్వే డీఆర్ఎం ఆనంద్ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ట్రైన్‌మేట్స్ గ్రూప్ సభ్యులు

ఏలూరు (టూటౌన్): ఇటీవల దక్షిణ మధ్య రైల్వే రద్దుచేసిన రత్నాచల్(12717–12718), కాకినాడ-తిరుపతి (17249–17250) ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ ఏలూరుకు చెందిన ట్రైన్‌మేట్స్ గ్రూపు సభ్యులు దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌కు వినతిపత్రం అందించారు. ప్రతి నిత్యం ఏలూరు నుంచి విజయవాడకు 200 మంది ప్రయాణిస్తుంటారని ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దుచేయడంతో వీరంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు డీఆర్ఎం దృష్టికి తీసుకు వెళ్లారు. విజయవాడ-రాజమండ్రి మధ్య నడిచే మెము ఎక్స్‌ప్రెస్ రైలు టైం ఉదయం 5.30 నుంచి 6 గంటల మధ్య బయలుదేరేలా చేస్తే నిత్యం ప్రయాణించే వారికి ఉపయోగకరంగా ఉంటుందని కోరారు.

పోలీసు శాఖకు సహకరించాలి



పీపీలు, ఏపీపీలతో ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్

ఏలూరు (టూటౌన్): కోర్టులో ఉన్న వివిధ అంశాలపై పోలీసు శాఖకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు తమ సహకారం అందించాలని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ కోరారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను జిల్లా పీపీలు, ఏపీపీలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టులో ఉన్న వివిధ అంశాలపై పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

22 వరకూ అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నెల 22 వరకూ సెలవులు ప్రకటించామని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి అధికారి కెపీఎల్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులను ఆదుకోవాలి



కైకరంలో పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం కార్యదర్శి కె. శ్రీనివాస్ తదితరులు

ఉంగుటూరు: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండు చేశారు. ఉంగుటూరు మండలంలోని కైకరంలో ముంపు పొలాలను రైతు సంఘాల ప్రతినిధులు పరిశీలించారు. రైతులు, కౌలు రైతులను అడిగి నష్టం వివరాలు, ముంపునకు కారణాలు అడిగి తెలుసుకున్నారు.

అతలాకుతలం

గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు జిల్లా వాసులకు కన్నీరు మిగిల్చాయి. ముఖ్యంగా ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో వాగులు, వంకలు ముంచెత్తడంతో పలు గ్రామాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. మరోవైపు గోదావరిలో వరద ప్రవాహం పెరుగుతుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో చిక్కుకున్నారు. జిల్లాలో పెదవాగు, ఎర్రకాల్వ, తమ్మిలేరు, గుండేరువాగు, జల్లేరువాగులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

– కుక్కునూరు/ముసునూరు/బుట్టాయగూడెం/ఏలూరు(మెట్రో)/వేలేరుపాడు

- ఏజెన్సీ, మెట్టలో వాగులు, వంకల విశ్వరూపం
- బలివే వద్ద తమ్మిలేరు ఉధృతి
- కొట్టుకుపోయిన కల్వర్టులు, రాకపోకలు బంద్
- ఎర్రకాలువలోకి భారీ వరద నీరు
- పెదవాగుకు వరదతో 12 గ్రామాలకు నష్టం



బుట్టాయగూడెం మండలంలో జల్లేరు ప్రవాహానికి కొట్టుకుపోయిన కల్వర్టు పరిశీలిస్తున్న పోలీసులు

భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద ప్రవాహం పెరుగుతోంది. శనివారం ఉదయం 10 గంటలకు భద్రాచలం వద్ద 32 అడుగులు ఉన్న ప్రవాహం సాయంత్రానికి 35 అడుగులకు చేరింది. రాత్రికి మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు సీడబ్ల్యూసీ అధికారులు పేర్కొన్నారు. తుఫాను ప్రభావంతో కుక్కునూరు మండల వ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. మూడు రోజులుగా కరెంట్, నీరు లేక మండల ప్రజలు నానాయతన పడ్డారు. ఇప్పుడు పెరుగుతున్న గోదావరి వరద మండలంలోని వాగుల్లోకి చొచ్చుకురావడం కలవర పెడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క పోలవరం ప్రాజెక్ట్ కారణంగా కొత్త ఇళ్లు నిర్మించుకోకుండా శిథిలావస్థకు చేరిన ఇళ్లలోనే కాలం గడుపుతున్నామని ఇప్పుడు పడే వర్షాలకు అవి ఎప్పుడు కూలుతాయోనన్న భయం తమను వెంటాడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

బలివే వద్ద ప్రమాదకరంగా వరద

వరదను ఎదుర్కొనేందుకు సర్వం సన్నద్ధంగా ఉన్నట్లు నూజివీడు ఆర్డీఓ భవానీశంకరి తెలిపారు. శనివారం బలివే, వెంకటాపురం వరద ప్రదేశాల్లో ఆమె పర్యటించారు. తమ్మిలేరులో వరద ఉధృతి పెరిగిందని, పరీవాహక గ్రామాలైన లోపూడి, గుళ్ళపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం, బలివే, వెంకటాపురం, వేల్పుచర్ల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇరువైపు ప్రయాణికులు, రైతులకు అవసరమైన బలివే దేవస్థానం సమీపంలోని చెక్ డ్యాం కమ్ బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిపివేయించి పరిస్థితిని సమీక్షించారు.

ఎర్ర కాలువలోకి తగ్గని వరద

జంగారెడ్డిగూడెం రూరల్: భారీ వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం ఉదయం 6 గంటల సమయంలో 12,525 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా, డ్యాం నాలుగు గేట్ల నుంచి 12,292 క్యూసెక్కుల వరద నీటిని అధికారులు విడిచిపెట్టారు. సాయంత్రం సమయానికి 10,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా, 10,800 క్యూసెక్కుల వరద నీటిని విడిచిపెట్టినట్లు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటి మట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.20 మీటర్లకు చేరింది.



కుక్కునూరు మండలంలో గోదావరి వరద కిన్నెరసాని వాగులోకి చొచ్చుకొచ్చిన దృశ్యం

నందమూరులోకి ఎర్రకాలువ నీరు

తాడేపల్లిగూడెం మండలంలోని నందమూరు గ్రామంలోకి ఎర్ర కాలువ నీరు ప్రవేశించింది. దీంతో ప్రజలు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. మాధవరం-కంసాలిపాలెం కాజ్‌వేకు వెళ్ళే రహదారిపై నుంచి ఎర్రకాలువ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో స్థానిక మహిళలు వరద నీటిలో పసుపు, కుంకుమలు వదిలి వరద శాంతించాలంటూ ప్రార్థించారు. ఎర్రకాలువ వరద నీటిని వీక్షించేందుకు నందమూరు అక్విడెక్ట్, మాధవరం-కంసాలిపాలెం, అప్పారావుపేట – కోరుమామిడి రహదారిపైకి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. జగన్నాథపురం గ్రామంలోని పునరావాస కేంద్రంలో 55 మంది నిరాశ్రయులకు భోజన ఏర్పాట్లు చేశారు.

పెదవాగు వరదలతో 12 గ్రామాలకు నష్టం

పెదవాగుకు ఆకస్మిక వరదలతో ఏలూరు జిల్లాలో 12 గ్రామాల తీవ్రంగా దెబ్బతిన్నాయని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. వేలేరుపాడు మండలంలో శనివారం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, సహాయక చర్యలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ప్రాజెక్ట్‌లో అధికంగా వరద చేరడంతో ప్రాజెక్ట్ 200 మీటర్ల మేర దెబ్బతినడంతో వరద వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని 12 గ్రామాల్ని ముంచెత్తిందన్నారు. 7,450 ఎకరాలలో వరి పంట దెబ్బతిందని, 290 ఎకరాల్లో నారుమళ్లు దెబ్బతిన్నాయన్నారు. 106 ఎకరాల్లో ఉద్యానవనాలు పంటలు దెబ్బతిన్నాయన్నారు. 5 కిలోమీటర్ల మేర 126 ప్రదేశాలలో రోడ్లు దెబ్బతిన్నాయని, రూ.4 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. తాగునీటి వనరులకు సంబంధించి 32 మోటార్లు దెబ్బతిన్నాయని రూ.23 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. వరద తగ్గిన వెంటనే నష్టం అంచనా వేస్తామన్నారు.

విపత్తు నివారణ దళం సిద్ధం

జిల్లాలో విపత్తు నివారణ దళం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు రెండు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు జిల్లాకు పంపినట్లు చెప్పారు.

కొట్టుకుపోయిన కల్వర్టులు

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బుట్టాయిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో కల్వర్టులు కొట్టుకుపోయాయి. రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరువాగు కల్వర్టు కొట్టుకుపోయింది. డీఎస్పీ పి. సురేష్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ మార్గాన్ని నిలిపివేశారు. రోడ్డుకు అడ్డంగా తాడు కట్టి రోడ్డుపై వాహనాలు తిరగకుండా నివారించారు. బూసరాజుపల్లి నుంచి పట్టిన పాలెం వెళ్ళే మార్గంలోని కల్వర్టు కొట్టుకుపోయింది. ఆ మార్గంలోని రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తెల్లంవారిగూడెం నుంచి కె. అంకంపాలెం మార్గంలోని సబ్బా కూడా వాగు ఉధృతికి కొట్టుకుపోయాయి.



లైఫ్‌బోట్‌ను సిద్ధం చేస్తున్న విపత్తు నివారణ దళం



బలివే వద్ద తమ్మిలేరు బ్రిడ్జి పరిశీలిస్తున్న అధికారులు

గుబ్బల మంగమ్మ దర్శనాలు నిలిపివేత



గుబ్బల మంగమ్మ గుడి పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం కామవరం అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి దర్శనాన్ని కొద్దిరోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి కోర్సా గంగరాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గుబ్బల మంగమ్మ గుడిపై నుంచి వరదనీరు భారీగా ప్రవహిస్తుందని చెప్పారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా కొండవాగులు ఉధృతంగా ప్రవహించి పలు చోట్ల రహదారులు పాడైపోయాయని చెప్పారు. ప్రస్తుతం రహదారుల మరమ్మత్తు పనులు చేపట్టామని దాదాపు 15-20 రోజుల వరకూ జరుగుతాయని చెప్పారు. మరికొద్ది రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భక్తులెవ్వరూ అమ్మవారి దర్శనానికి రావొద్దని చెప్పారు. కామవరం వద్ద ఉన్న ప్రధాన ద్వారం గేట్లు, వేపులపాడు సమీపంలో ఉన్న రామచంద్రాపురం వద్ద ఏర్పాటు చేసిన గేట్లకు తాళాలు వేశామని చెప్పారు. గుబ్బల మంగమ్మ దర్శనానికి భక్తులెవ్వరూ రావొద్దని స్థానిక పోలీసులు కూడా సూచించారు.

ఉధృతంగా గుండేరు వాగు



తాగునీటి కోసం వాగు దాటుతున్న ప్రజలు

దెందులూరు: దెందులూరు శివారు సత్యనారాయణపురంలో గుండేరు వాగు ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలోని టి.నర్సాపురం, చింతలపూడి, నాగిరెడ్డిగూడెం, పెదవేగి, జోగన్నపాలెం మీదుగా గుండేరు వాగు ప్రవహిస్తుంది. రెండు రోజులుగా గ్రామంలో వాగుకు అటు వైపు నుంచి ఇటు వైపుకు, ఇటు వైపు నుంచి అటు వైపుకు రాకపోకలు తెగిపోయాయి. తాగునీరు, నిత్యావసర వస్తువులు కోసం గ్రామంలో నివసిస్తున్న దాదాపు 600 మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వాటర్ టిన్లు పట్టుకుని సాహసం చేస్తూ తాగునీటి కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న గుండేరువాగులో అటు వైపు వెళ్ళి తెచ్చుకుంటున్నారు. గతంలో ఇదే పరిస్థితి తలెత్తినప్పుడు అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి బోటు ఏర్పాటు చేశారు. వాగు ఉధృతి తగ్గే వరకు బోటు ద్వారా వాటర్ టిన్లను సరఫరా చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు(మెట్రో): భారీ వర్షాలు, వరదల వల్ల ఎలాంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా పటిష్ఠ చర్యలతో మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ బంగ్లా నుంచి శనివారం జిల్లాలో వర్షాలు, వరదలకు సంబంధించి పునరావాస కార్యక్రమాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి వరద మొదటి ప్రమాద హెచ్చరిక(43 అడుగుల)కు ముందే ముంపునకు గురయ్యే గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన బియ్యం, నూనె, పప్పు, కొవ్వొత్తులు, తదితర వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. గోదావరి వరద, ఎరక్రాలువ, తమ్మిలేరు, కొల్లేరు నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే ఎలాంటి సంకోచం లేకుండా ఏ సమయంలోనైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొండవాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. తాగునీటి సమస్యలేకుండా అవసరమైన వాటర్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వరద సమయంలో కొండపైకి వెళ్లతామని చెప్పేవారికి టార్పాలిన్లు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి హ్యాబిటేషన్, ప్రతి పునరావాస కేంద్రానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను అందించాలన్నారు. వర్షాలు మూలంగా సంభవించే పరిస్థితులను అంచనా వేస్తూ దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు.

నిర్లక్ష్యానికి తావులేదు : వరద సహాయ కార్యక్రమాల్లో అలసత్వాన్ని సహించేదిలేదని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి హెచ్చ రించారు. శనివారం వివిధ శాఖల అధికారులతో పునరావాస కార్యక్రమాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా ఏ ఒక్కరూ అలసత్వంతో వ్యవహరించకుండా అప్రమత్తంగా పునరావాస చర్యల ముందస్తు ప్రణాళిక అమలు చేయాలన్నారు. లొకేషన్ పేరును ట్యాగ్ చేస్తూ గ్రూపులో ఆహార తయారీ, పంపిణీ ఫొటోలను పోస్టు చేయాలని ఆదేశించారు. ముందురోజుకు సరిపడే వాటర్ ప్యాకెట్లు, తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని ఆదేశం

సాక్షి స్పందన

దెందులూరు: దెందులూరులో బస్టాండ్ సెంటర్ ఆయుర్వేద వైద్యశాల నిర్వాసిత ప్రాంతాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, గౌడ వీధిలో నివాసిత ప్రాంతం మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని విద్యుత్ శాఖ ఏడీఈ ఎస్.త్రివాస్ శనివారం ఆదేశించారు. సాక్షిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించండి శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన ఏడీఈ భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాలని సూచించారు.

ఇంటికే భోజనాలు అందించాలి



మేడేపల్లి సచివాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

వేలేరుపాడు: వరద బాధిత కుటుంబాలకు ఇంటివద్దకు భోజనం అందించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. వేలేరుపాడు మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన అనంతరం మేడేపల్లిలోని గ్రామ సచివాలయంలో వరద సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరద బాధిత కుటుంబాలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఇంటివద్దకు అందించాలన్నారు. అవసరమైన నిత్యావసరాలు వంట చేసే ఏజెన్సీలకు అందించాలన్నారు. చిన్న పిల్లలున్న ఇళ్లకు పాలు సరఫరా చేయాలన్నారు. ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాలన్నారు. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు టార్పాలిన్లు అందించాలన్నారు. ప్రసవ సమయానికి దగ్గరగా ఉన్న గర్భిణులను దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని, పిల్లలు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కనెక్టివిటీ రోడ్లకు అత్యవసరంగా మరమ్మతులు నిర్వహించాలన్నారు. వరద ప్రభావిత గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఎం.సూర్యతేజ, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

52.4 మి.మీ. సగటు వర్షపాతం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 52.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అత్యధికంగా వేలేరుపాడులో 98.6 మి.మీ నమోదుకాగా, అత్యల్పంగా అగిరిపల్లిలో 33 మి.మీ నమోదైంది. నూజివీడులో 98.6, లింగపాలెం 79.4, వేలేరుపాడు 79.0, పెదవేగి 78.4, చాట్రాయి 67.0, కామవరపుకోట 62.4, అగిరిపల్లి 59.2, కొయ్యలగూడెం 57.4, బుట్టాయిగూడెం 54.2, ముదినేపల్లి 53.2, టి.నరసాపురం 53.0, పోలవరం 52.4, భీమడోలు 51.4, జంగారెడ్డిగూడెం 49.4, కుకునూరు 46.2, చింతలపూడి 46.0, పెదపాడు 45.2, ద్వారకాతిరుమల 44.6, ఏలూరు అర్బన్ 43.0, మండవల్లి 42.2, ఏలూరు రూరల్ 41.8, ముసునూరు 40.2, దెందులూరు 39.2, ఉంగుటూరు 38.8, జీలుగుమిల్లి 37.6, కలిదిండి 36.6, కై కలూరు 36.4, నిడమర్రులో 33.0 మీ.మీ. వర్షపాతం నమోదైంది.

26న కేజీఆర్‌ఎల్‌లో జాబ్ డ్రైవ్

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరియర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో భీమవరం కేజీఆర్‌ఎల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న సూర్యమిత్ర ఎగ్జిమ్‌లోని వివిధ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి శనివారం చెప్పారు. ఈ జాబ్ డ్రైవ్‌లో సూర్యమిత్ర కంపెనీలో సీనియర్ ఎలక్ట్రీషియన్, సూపర్‌వైజర్స్, హెచ్ఆర్ అసిస్టెంట్, కోల్డ్ స్టోరేజ్ సూపర్‌వైజర్స్, క్వాలిటీ కంట్రోల్ వంటి వివిధ ఉద్యోగావకాశాలున్నాయన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 95020 24765, 70138 96277 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

కొనసాగుతున్న తమ్మిలేరు వరద



నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరులో జలకళ

చింతలపూడి: ఖమ్మం జిల్లా బేతుపల్లి నుంచి తమ్మిలేరు రిజర్వాయర్‌కు శనివారం వరద కొనసాగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు వద్దే మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటి మట్టం ప్రస్తుతం 344.24 అడుగులకు చేరుకుంది. గోనెలవాగు స్టోరేజ్ ట్యాంక్ నీటిమట్టం 342.20 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 3 టీఎంసీలు కాగా 1.337 టీఎంసీలకు చేరుకున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి అలుగుపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 3,426 క్యూసెక్కుల నీరు ఆంధ్రా కాల్వ ద్వార ప్రాజెక్టులోకి వస్తోందన్నారు. ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేయవచ్చు. ప్రాజెక్టు నీటి మట్టం 348 అడుగులకు చేరుకున్నాక వరద పరిస్థితిని అంచనా వేసి ప్రధాన గేట్ల ద్వార దిగువకు విడుదల చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

ఆస్తి కోసం తండ్రిని చంపిన కొడుకు


శ్రీనివాసరావు మృతదేహం

కామవరపుకోట: చెడు వ్యసనాలకు బానిసై ఆస్తి తన పేరున రాయలేదనే కక్షతో మద్యం మత్తులో కన్న తండ్రిపై దాడి చేసి హతమార్చాడో కొడుకు. వివరాల్లోకి వెళితే.. తడికలపూడి గ్రామనికి చెందిన నాగబోయిన శ్రీనివాసరావు (50) భార్య గతంలో చనిపోవడంతో కుమారుడు కార్తీక్‌తో కలిసి గ్రామ శివారు వేంపాడు రోడ్డులో నివాసం ఉంటున్నాడు. కార్తీక్ మద్యానికి బానిసై నిత్యం డబ్బు ఇవ్వాలని తండ్రిని వేధించేవాడు. తండ్రి పేరును ఉన్న రెండున్నర ఎకరాల భూమిని తన పేరును రాయాలని అనేక సార్లు తండ్రితో గొడవ పడి ఒత్తిడి చేసేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కార్తీక్ పూటుగా మద్యం తాగి వచ్చి ఆస్తి తన పేరున రాయాలని తండ్రి శ్రీనివాసరావుతో గొడవపడ్డాడు. అందుకు తండ్రి నిరాకరించడంతో కార్తీక్ మద్యం మత్తులో తండ్రి శ్రీనివాసరావుపై దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తడికలపూడి ఎస్సై జయబాబు ఘటన స్థలానికి చేరుకుని నిందితుడు కార్తీక్‌ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసరావు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బకాయి బిల్లులు చెల్లించాలంటూ వినతి


డీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచ్‌ల హక్కులు, విధులను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన డీపీఓ కార్యాలయ పౌరసమాచార అధికారి ఎం వీ కిషోర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ముప్పవరం పంచాయతీలో హెల్త్ క్లినిక్ సెంటర్ నిర్మాణానికి రూ.8లక్షలు ఖర్చు పెట్టినా నేటికీ ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదని ఆరోపించారు. అలాగే పంచాయతీ పరిధిలో వీధి దీపాలు, డ్రైయిన్లు, రోడ్లు తదితర పనులకు సంబంధించి రెండు నెలలు కావస్తున్నా బిల్లులు చెల్లించలేదన్నారు. పంచాయతీలో చేసిన పనులకు తక్షణమే నిధులు విడుదల చేయాలంటూ విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ఎప్పుడో?

- జగన్ ప్రభుత్వంలో ఏటా జూన్‌లోనే కాంట్రాక్ట్ పునరుద్ధరణ
- రెగ్యులరైజేషన్ కోసం జీఓ ఇచ్చినా కోడ్‌తో నిలిచిన అమలు
- పీఆర్‌సీ కూడా వర్తింపచేయడంతో భారీగా పెరిగిన జీతాలు
- కొత్త ప్రభుత్వంలో కాంట్రాక్ట్ పునరుద్ధరణపై కానరాని చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 39 కళాశాలల్లో 270 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు


ఏలూరులోని కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ విభాగం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినా కాంట్రాక్ట్ లెక్చరర్ల ఒప్పంద గడువును కొత్త విద్యా సంవత్సరానికి పునరుద్ధరించాల్సి ఉన్నా ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని కాంట్రాక్ట్ లెక్చరర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. గత జగన్ సర్కారు అప్పటివరకు ఉన్న తొమ్మిది నెలల కాలపరిమితిని ఏడాదికి పొడిగించడంతో పాటు పీఆర్‌సీ వర్తింపజేయడంతో ఒక్కసారిగా రూ.20వేలకు పైగా వారి జీతాలు పెరిగాయి. అదే విధంగా కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేసేందుకు జీవో విడుదల చేశారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా అది అమలు కాలేదు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వంలో తమ కాంట్రాక్ట్‌ను పునరుద్ధరిస్తుందా లేక మరో నిర్ణయమేదైనా తీసుకుంటుందా అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఇంటర్మీడియట్ విద్యలో కాంట్రాక్ట్ లెక్చరర్ల పాత్ర అత్యంత కీలకం. సైన్స్, ఆర్ట్స్ సబ్జెక్టులు బోధించే లెక్చరర్లు అధిక శాతం మంది కాంట్రాక్ట్ అధ్యాపకులే. గతంలో వీరికి జీతాలు కూడా నామమాత్రంగానే ఉండేవి. 2019లో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ అధ్యాపకుల కష్టాలను తెలుసుకుని వారికి పీఆర్‌సీ వర్తింపజేయడంతో అప్పటివరకు రూ.37,100గా ఉన్న వీరి జీతాలు ఒక్కసారిగా రూ.57,100కు పెరిగాయి.

ఏటా జూన్ ఒకటో తేదీలోపే జీవో

దాదాపు 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులకు వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగింది. 2019కి ముందు కాంట్రాక్ట్ అధ్యాపకులకు విద్యాసంవత్సరంలో 6 నుంచి 9 నెలలకు మాత్రమే కాంట్రాక్ట్ లభించేది. అంటే ఏడాదంతా పనిచేసినా వారికి జీతాలు మాత్రం కేవలం 6 నుంచి 9 నెలలకు పరిమితమయ్యేది. కొన్ని సార్లు విద్యా సంవత్సరం ముగిసిన అనంతరం కూడా వీరితో చాకిరీ చేయించుకుని ఎటువంటి జీతాలూ చెల్లించేవారు కాదు. అటువంటి పరిస్థితిలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో వీరికి విద్యా సంవత్సరం వరకు మాత్రమే కాక ఏడాది మొత్తం అంటే 12 నెలలూ కాంట్రాక్ట్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. 2019 నుంచి ఏటా క్రమం తప్పకుండా జూన్ ఒకటో తేదీ లోపే అధ్యాపకుల కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో అప్పటివరకు కొన్ని నెలలు జీతాలు రాక సమస్యలు ఎదుర్కొన్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు వైఎస్ జగన్ తీసుకున్న చర్యతో సంతృప్తిని మిగిల్చింది.

రెండు నెలలుగా అందని జీతాలు

కాంట్రాక్ట్ అధ్యాపకులు విద్యా సంవత్సరం ముగిసిన తరువాత కూడా ఖాళీగా లేకుండా విధులు నిర్వహించారు. గత మే నెలలో ఎన్నికల విధుల్లో పాలుపంచుకున్నారు. తరువాత సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. అనంతరం సప్లిమెంటరీ పరీక్షల విధులు, వెంటనే ఆన్‌లైన్ మూల్యాంకనం విధులకు కూడా హాజరయ్యారు. దీంతో పాటు 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన ప్రత్యేక డ్రైవ్‌ను కూడా కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టారు. జూన్ ఒకటో తేదీ నుంచే కళాశాలల్లో బోధనకు సిద్ధమయ్యారు. అయినా మే, జూన్ నెలలకు సంబంధించిన జీతాలు ఇప్పటికీ అందకపోవడం గమనార్హం. వీరి కాంట్రాక్ట్‌ను పునరుద్ధరిస్తే తప్ప వీరికి ఆయా పెండింగ్ నెలల జీతాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

సింహభాగం కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్లదే

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 39 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో ఏలూరు జిల్లాలో 90 మంది ప్రభుత్వ, 160 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉన్నారు. పశ్చిమగోదావరిలో 80 మంది ప్రభుత్వ లెక్చరర్లు, సుమారు 110 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. వీరితో పాటు ఈ రెండు జిల్లాల్లో సుమారు 1300 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. అంటే ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోధన తరగతులు నిర్వహించడంలో సింహభాగం కాంట్రాక్ట్, గెస్ట్ లెక్చరర్లే తీసుకుంటున్నారు.

114 జీఓను అమలు చేయాలి



“ వైఎస్ జగన్ ప్రభుత్వం 2023 అక్టోబర్ 23న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేస్తూ 114 జీఓను విడుదల చేసింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో జీఓ అమలు నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం ఆ జీఓను అమలు చేసి కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలి. దీంతో పాటు కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకోవాలి.

– బీజే గాంధీ, ప్రైవేట్ లెక్చరర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వెంటనే జీతాలు చెల్లించాలి



మే, జూన్ నెలలకు సంబంధించిన జీతాలు ఇప్పటికీ విడుదల కాక కాంట్రాక్ట్ లెక్చరర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారి ఈఎంఐలు చెల్లించలేక పెనాల్టీలు కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్ల దుర్భర పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలి.

– గోపే శ్యామ్‌కుమార్, ఉమ్మడి జిల్లా కాంట్రాక్ట్ లెక్చరర్ల యూనియన్ అధ్యక్షుడు

గృహశిశు చిన్నారి దత్తత


గృహశిశు చిన్నారిని దత్తత ఇస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో) : ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన పిల్లలు లేని దంపతులకు ఏలూరులోని శిశుగృహంలో పెరుగుతున్న 3 నెలల వయస్సున్న మగ శిశువును కలెక్టర్ వెట్రి సెల్వి శనివారం దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తత తీసుకున్న దంపతులు శిశువును మంచి పోషణతో పెంచి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత స్థానంలోకి తీసుకురావాలని కోరారు. పిల్లలు లేని తల్లిదండ్రుల ఆవేదనలు అర్థం చేసుకుని కారా నియమ నిబంధనలు సరళీకృతం చేయడం జరిగిందన్నారు. వ్యక్తిగతంగా భార్యాభర్తలకు/తల్లిదండ్రులకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకుని ముందుకు వెళ్లాలని, వారి సమస్యల వలన పిల్లలను ఇబ్బంది పెట్టవద్దన్నారు. అలాంటి పిల్లలను షెల్టర్ హోమ్‌లలో పెట్టి చదివిస్తారని, చంటిబిడ్డలు అయితే శిశుగృహలో ఉంచి మరింత జాగ్రత్తగా చూసుకుంటారని తెలిపారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా నుంచి వచ్చిన మీనకిర్తన్ మహారాణ, సంధ్యా కుమారి మహరణ దంపతులు గతంలో దత్తత కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా, శనివారం దంపతులకు మహేష్ అనే మగ శిశువును దత్తత ఇచ్చారు. డీసీపీఓ డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి, శిశు గ్రహ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

రూ.400 తాకిన వర్జీనియా గరిష్ట ధర



జంగారెడ్డిగూడెం: వర్జీనియా గరిష్ట ధరలను తాకుతూ దూసుకుపోతోంది. సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఆశాజనకంగా ఉంది. బయ్యర్లు ఉత్సాహంగా పొగాకును కొనుగోలు చేస్తున్నారు. శనివారం వర్జీనియా కేజీ ధర రూ.400కు చేరుకుని నూతన గరిష్టాన్ని నమోదు చేసింది. ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలో పండిన పొగాకు నాణ్యతతో ఉండటంతో డిమాండ్ పెరగడానికి కారణమైంది. రూ.300 దాటితే గట్టెక్కుతామని భావించిన రైతులకు ధర రూ.400కు చేరుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో గోపాలపురం కేంద్రంలో రూ.400 నమోదు కాగా, మిగిలిన కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం–1, జంగారెడ్డిగూడెం–2, దేవరపల్లి వేలం కేంద్రాల్లో రూ.399 పలికింది. సగటు ధర సైతం నువ్వా నేనా అన్నట్లు రూ.371కు చేరుకోవడం విశేషం. అధికారులు సైతం ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పడంతో వర్జీనియా రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తి తగ్గడంతో దేశీయ వర్జీనియా పొగాకుకు డిమాండ్ పెరిగింది. ప్రధాన ఉత్పత్తిదారులైన బ్రెజిల్, జింబాబ్వేలలో ఈ ఏడాది పంట దిగుబడి తగ్గింది. అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా పంట దిగుబడి లేకపోవడంతో, మన పొగాకుకు ఆర్డర్‌లు పెరుగుతున్నాయి. ఇదేవిధంగా ధరలు కొనసాగితే ఈ ఏడాది వర్జీనియా సీజన్ రైతులకు కాసులు కురిపించినట్లే.

శ్రీవారి క్షేత్రంపై వర్షం ప్రభావం



ద్వారకాతిరుమల: వర్షం కారణంగా చినవెంకన్న దివ్య క్షేత్రంలో భక్తుల రద్దీ బాగా తగ్గింది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి శనివారం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శిస్తుంటారు. అయితే ఈ వారం కుండపోత వర్షం కారణంగా ఆలయానికి భక్తులు నామమాత్రంగా విచ్చేశారు. దీంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, నిత్యాన్నదాన భవనం, కేశఖండనశాల ఇలా అన్ని విభాగాల్లో భక్తులు నామమాత్రంగా కనిపించారు.

గంజాయి తరలిస్తూ దొరికిన దొంగ

కామవరపుకోట : ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఘటనలో అరెస్టు అయిన ఓ వ్యక్తి చోరీ కేసులో కూడా నిందితుడనే విషయం పోలీసుల విచారణలో తేలింది. ఎస్సై జయబాబు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి తడికలపూడి స్టేషన్ వద్ద ఎస్సై సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా, కామవరపుకోటకు చెందిన సతీష్ అనే ద్విచక్ర వాహనదారుడిని తనిఖీ చేయగా 22 కేజీల గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించి, స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతడిని అదుపులో తీసుకుని విచారించగా ఈనెల 5న చేబ్రోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో చోరీకి కూడా ఆ వ్యక్తి పాల్పడినట్లు తేలింది. నిందితుడి నుంచి గంజాయితో పాటు రూ.1.20 లక్షల నగదు, బైక్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం కొత్తపాలెంలో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొగల్తూరు ఎస్సై కె.వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం పెయ్యూరు గ్రామానికి చెందిన గురజాడ రమేష్ (35) 15 ఏళ్ల క్రితం మొగల్తూరు మండలం కొత్తపాలెంకు చెందిన యువతిని వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. అతని భార్య కువైట్‌లో ఉంటుండగా వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం వేకువజామున రమేష్ నివాసం ఉంటున్న ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థికపరమైన కారణాలే ఆత్మహత్యకు కారణమని బంధువులు చెబుతున్నారు. బావమరిది వర్దనపు చిట్టిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్ఫ్ పంపిస్తానని మోసం

భీమవరం: గల్ఫ్ పంపిస్తానని డబ్బు తీసుకుని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టుటౌన్ హెచ్‌సీ భూషణం చెప్పారు. భీమవరానికి చెందిన సంగాని ఏసుపాదంను గల్ఫ్ పంపిస్తానని ఆకివీడుకు చెందిన కారాడి దుర్గారావు దఫదఫాలుగా రూ.1.70 లక్షలు తీసుకున్నాడు. ఇప్పటికీ గల్ఫ్ పంపించలేదని ఏసుపాదం భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని భూషణం శనివారం చెప్పారు.